క్లుప్తంగా

లడ్డూ కౌంటర్‌లో ఆకస్మిక తనిఖీ



లడ్డూ కౌంటర్లలో తనిఖీలు చేస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమలలోని లడ్డూ కౌంటర్‌లో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా టోకెన్ల స్కానింగ్, లడ్డూల జారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. లడ్డూ రుచి, నాణ్యత పెరగడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకాశదేశం పుస్తకావిష్కరణ



ఆకాశదేశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రాసాని

తిరుపతి సిటీ: యువరచయిత నామతోటి రవితేజ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, మార్పు ప్రధాన అంశాలుగా రచించిన ఆకాశదేశం పుస్తకాన్ని ప్రముఖులు ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక మంగళంలోని క్రెసెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కరస్పాండెంట్ వరిశెట్టి చెంగల్రాయులు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్, ప్రముఖ రచయిత వీఆర్ రాసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష అంపశయ్యంపై ఉందని, భాష కనుమరుగవుతున్న నేటి సమాజంలో రవితేజ లాంటి యువత సాహిత్యంపై మొగ్గు చూపి సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పుస్తకాలు రాయడం శుభ పరిణామన్నారు. ఓ యువకుడు సమాజ బాధను తన బాధగా భావించి నిపుణులైన కవులకు దీటుగా ఆకాశదేశం పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. అనంతరం యువ రచయితను అతిథులు ఘనంగా సత్కరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అన్నదానం

తిరుపతి అర్బన్: బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి నగరంలోని కపిలతీర్థం వద్ద అన్నదానం చేపట్టారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఏటా బ్యాంకు ఉద్యోగులు అన్నదానం నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా నిర్వహించినట్లు బ్యాంకు ఉద్యోగ సంఘం నేతలు ధన్వంత కుమార్, విజయభాస్కర్ తెలియజేశారు. పలువురు బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

వేడుకగా వెలమల కార్తీక వన భోజనాలు



కార్తీక వన భోజన మహోత్సవాల్లో అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కైలాసకోనలో కార్తీక వన మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కై లాస కోనలోని శివాలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ కల్లా జనార్దన్‌నాయుడు హాజరై 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో సత్కరించి అభినందించారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రముఖ ఆడిటర్ సూరనేని రామచంద్రా రావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన అధ్యక్షుడు రంగినేని గోపాల్ నాయుడు, కార్యదర్శి కల్లా నాగేశ్వరరావు, కోశాధికారి వెలుగులేటి మురళీరావు, వెలమ కుటుంబ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

రామాపురంలో ..

తిరుపతి రూరల్ రామాపురంలో అనంతవీధి కుటుంబ సభ్యులు ఆదివారం కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఆనంద భరితంగా జరుపుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఉత్సాహ భరితంగా సాగారు. చివరిగా అనంతవీధి కుటుంబాలు సహపంక్తి భోజనాలు చేశారు.



రామాపురంలో..



మాతృత్వ మాధుర్యం..
ఐవీఎఫ్‌తో సఫలం

రాష్ట్రంలో దాదాపు 15 శాతం మంది దంపతులు సంతానలేమితో బాధపడుతున్నట్లు ఓ సర్వే చెబుతోంది. దైనందిన జీవితంలో మారిన ఆహారపు అలవాట్ల వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యల్లో సంతానలేమి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. జంక్‌ఫుడ్, ఎక్కువసేపు కంప్యూటర్ ముందు కూర్చుని చేసే జాబ్‌ల కారణంగా ఈ సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరిలో జన్యుపరంగా కూడా ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలు వస్తున్నాయని వైద్యులు, నిపుణులు పేర్కొంటున్నారు. మంచి ఆహారంతో పాటు నిద్ర, వ్యాయామం చేస్తే సంతానలేమి అనేది పెద్ద సమస్య కాదని వైద్యులు సూచిస్తున్నారు.


- అనేక కారణాలతో సంతానలేమికి దూరమవుతున్న దంపతులు
- మారుతున్న లైఫ్ స్టైల్, మానసిక, ఉద్యోగ ఒత్తిళ్లతో సంతానలేమి
- ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్ల సమతుల్యతా కూడా కారణాలే..!
- మంచి ఆహారపు అలవాట్లు, జీవన విధానంతో సత్ఫలితాలు
- ఫలదీకరణ సమస్యలకు పరిష్కారం
- ఫర్టిలిటీ సెంటర్లతో మాతృత్వ మాధుర్యం

తిరుపతి తుడా: ఇటీవల దేశంలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పెరుగుతున్న మెట్రో పాలిటన్ కల్చర్ కారణంగా సంతానలేమి సమస్య ఉత్పన్నం అవుతోందని ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, ఉద్యోగాల్లో ఒత్తిడి, ఆహార అలవాట్లు, క్రమంగా లేని పనివేళలు, శారీరక శ్రమ ఎక్కువగా లేకపోవడం, అధిక బరువు, మద్యపానం, పొగతాగడం, డ్రగ్స్ వంటి అనారోగ్యకర అలవాట్లు, వ్యసనాలు వంటివి సంతాన లేమికి దారితీస్తున్నాయి.

ఒత్తిడి వల్ల కూడా..

మహిళల్లో కనిపించే ఇన్ఫెక్షన్లు, మానసిక ఒత్తిడి, హార్మోన్లలో సమతుల్యత దెబ్బతినడం వంటివి సంతానలేమికి కారణమవుతున్నాయి. అండం తయారీలో, ఫలదీకరణలో, పిండం ఇంప్లాంటేషన్ ఇబ్బందులు మహిళలకు ప్రత్యేకంగా వచ్చే సమస్యల్లో కొన్ని. ఇక మగవారిలో శుక్రకణాల సంఖ్య కదలిక, నాణ్యత తగ్గడం సంతానం కలగడానికి అవరోధంగా నిలుస్తున్నాయి.





సంతానలేమి నిర్ధారణ ఎలా?

భార్యాభర్తలు ఏడాది పాటు గర్భధారణ కోసం ప్రయత్నించినా గర్భం రాకపోతే అప్పుడు ఆ దంపతులకు సంతాన లేమి సమస్య ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఈ సమస్యను ప్రైమరీ ఇన్‌ఫర్టిలిటీ అంటారు. మొదటిసారి గర్భధారణ తర్వాత, రెండోసారి గర్భదారణ కోరుకున్నప్పుడు ఏడాది పాటు ప్రయత్నించినా గర్భం దాల్చకపోతే దాన్ని సెకండరీ ఇన్‌ఫర్టిలిటీ అంటారు.

ఎవరికి చికిత్స అవసరం..

మహిళకు ప్రతినెలా నెలసరి సక్రమంగా వస్తూ, రెండేళ్ల పాటు ప్రయత్నించాక కూడా అప్పటికీ గర్భం రానివారికీ, అలాగే ఆ మహిళ 30 ఏళ్ల వయసుకు చేరుకుంటున్నప్పుడు.. ఆ దంపతులు డాక్టర్‌ను సంప్రదించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకోవడం మంచిది.

గర్భాశయంలో లోపాలు..

సాధారణంగా గర్భాశయంలో లోపాల వల్ల గర్భం దాల్చలేని వారు దాదాపు 10 శాతం నుంచి 15శాతం వరకు ఉంటారు. గర్భాశయంలో లోపాలు కూడా అనేక కారణాల వల్ల కలుగుతుంటాయి. గర్భాశయ ముఖద్వారంలో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉన్నా, అక్కడ స్రవాలు చిక్కగా ఉన్నా, గర్భాశయ ముఖద్వారం మరీ సన్నగా ఉన్నప్పుడు వీర్యకణాలు గర్భసంచి లోపలికి ప్రవేశించలేకపోవచ్చు. ఆమ్లగుణం మరీ ఎక్కువగా ఉంటే అవి వీర్యకణాలను చైతన్యరహితం చేస్తాయి.

ఐవీఎఫ్ ప్రక్రియ పని చేస్తుందిలా...

స్త్రీ, పురుషులిద్దరిలోనూ ఫలదీకరణ సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్లు ఐవీఎఫ్ మార్గాన్ని సూచిస్తారు. ఈ ప్రక్రియలో తొలుత మహిళలో అండాలు బాగా పెరిగేందుకు మందులిస్తారు. అందులో ఆరోగ్యకరమైన అండాలను సేకరించి, పురుషుడి నుంచి స్వీకరించిన శుక్రకణాలతో ప్రయోగశాలలో ఫలదీకరణం చెందిస్తారు. ఈ ప్రక్రియలో ఒకటి కంటే ఎక్కువ పిండాలు వృద్ధి చెందుతాయి. ఇందులో నుంచి ఆరోగ్యకరమైన పిండాలను మళ్లీ మహిళ గర్భంలోకి ప్రవేశపెడతారు. మిగతా పిండాలను శీతలీకరించి పక్కన పెట్టుకుంటారు. ఆరు వారాల తర్వాత అల్ట్రా సౌండ్ పరీక్ష చేసి, ఆమెలో గర్భం నిలిచిందా లేదా అన్నది నిర్ధారణ చేసుకుంటారు. ఒక వేళ గర్భం నిలవకపోతే శీతలీకరించిన పిండాల్లో మరోదాన్ని గర్భంలోకి ప్రవేశ పెడుతారు.

ఏయే చికిత్సలు తీసుకోవాలంటే..!

అండం సరిగా పెరగనప్పుడు, అది పెరగడానికి క్లోమిఫిన్, లెట్రోజ్ వంటి కొన్ని రకాల మాత్రలు, వాటి మోతాదులను క్రమంగా పెంచుకుంటూ వాడాలి. కొందరికి గొనాడోట్రోపిన్ హార్మోన్ ఇంజెక్షన్ అవసరం అవుతుంది. అండాశయాలలో పీసీఓడీ కారణంగా అండాలు పెరగకపోతే లాప్రోస్కోప్ ఆపరేషన్ ద్వారా, పీసీఓడీలోని నీటితిత్తుల్లో కొన్నింటిని పేల్చడం అవసరం. దీన్నే ఒవేరియన్ డ్రిల్లింగ్ అంటారు. ఇక అండాశయంలో నీటితిత్తులు, ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యలను కూడా లాప్రోస్కోపిక్ ప్రక్రియ ద్వారా తొలగించి, ఆ తర్వాత గర్భం వచ్చేందుకు అవసరమైన చికిత్స అందించాలి. థైరాయిడ్ సమస్య ఉంటే దాన్ని తగ్గించే మందులు వాడాలి. అప్పుడు హార్మోన్ల అసమతుల్యత తగ్గి, గర్భధారణకు అవకాశాలు మెరుగుపడతాయి.

ఆహారపు అలవాట్లే కారణం...



ప్రస్తుతం యువతీ, యువకుల్లో ఆహారపు అలవాట్లు సంతానలేమి సమస్యలకు కారణం అవుతున్నాయి. మితిమీరిన ఆల్కహాల్, సిగరెట్ తాగడంతో ప్రత్యుత్పత్తి సంబంధిత సమస్యలు వస్తున్నాయి. గర్భాశయంలో లోపాలు, అండాశయాల్లో బుడగలు (పీసీఓడీ), వీర్య కణాల సంఖ్య తగ్గడం, చలనం లేకుండా పోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఆహారపు అలవాట్లు సరి చేసుకుని, ఆరోగ్యకరమైన జీవన విధానంతో సంతాన లేమి సమస్యలకు దూరం కావచ్చు.

– డాక్టర్ మీనాక్షి జైన్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్, తిరుపతి.

పురుషుల్లోనూ సమస్యలు..



స్త్రీలతో పాటు పురుషుల్లో కూడా పలు సమస్యలు ఉంటాయి. పురుషుల్లో వీర్యకణాలు తక్కువగా ఉండడం అతిపెద్ద సమస్య. సరైన మందులు ఇవ్వడంతో పాటు సరైన జీవన విధానం పాటిస్తే వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. కొందరిలో అసాధారణమైన వీర్యకణాలు ఉంటాయి. వాటిలో లోపాలు ఉంటాయి. సరైన ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటే వాటి నాణ్యత పెరుగుతుంది. ఇక కొందరిలో వీర్యకణాల కదలిక తక్కువగా ఉంటుంది. ఈ సమస్యను కూడా మందులతో తగ్గించవచ్చు.

– డాక్టర్ యు.శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలి



సమావేశానికి హాజరైన అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఎస్వీయూలో జరిగిన ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆధునిక కాలంలో సామాజిక మాధ్యమాలు, మత్తు పదార్థాలు, పరిపక్వత లేని ప్రేమ పరిచయాలు, ప్రలోభాలకు గురై పక్కదారి పడుతున్న విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జాతీయ భావాలు కలిగి దేశాభివృద్ధికి తోడ్పడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. 2047కు భారతదేశం స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్ల సంబరాన్ని జరుపుకోనున్న సందర్భంగా భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే విధంగా పాఠ్య ప్రణాళికలలో ఆధునిక విజ్ఞానాన్ని చేర్చి ప్రపంచ దేశాలకు దీటుగా భారతీయ విద్యార్థులను రూపుదిద్దాల్సిన బాధ్యత విద్యాసంస్థలు, అధ్యాపకులపైనే ఉందన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి భారత రాజ్యాంగం 75 సంవత్సరాల దినోత్సవం జరుపుకోనున్న సందర్భంగా ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధులు ప్రొఫెసర్ వరదరాజన్, ప్రొఫెసర్ రాజశేఖర్, ప్రొఫెసర్ బాలాజీ డాక్టర్ బాలసుబ్రమణ్యం, రమేష్, పద్మావతి, చంద్రశేఖర్, శ్రీవాణి, మంజునాథ్, 60 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతితో టీటీడీ చైర్మన్ భేటీ

తిరుమల: కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం సాయంత్రం తిరుమలలోని కంచి మఠంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామీజీ చైర్మన్‌కు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఇటీవల తీసుకున్న నిర్ణయాలను అభినందించారు. తిరుమల పవిత్రతను కాపాడే విధంగా, భక్తులకు మేలు చేకూరేలా నిర్ణయాలు తీసుకోవడం ప్రశంసనీయమని తెలిపారు. తిరుమలను మరింత సుందర దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని, వేద విద్య వ్యాప్తికి కృషి చేయాలని చైర్మన్‌కు సూచించారు.

ఎమ్మెల్యేకి వినతి

తిరుపతి సిటీ: అణగారిన వర్గాలైన దళిత, కాపు, బీసీ సామాజికవర్గాలకు అండగా నిలబడి సహకరించాలని ఏపీ దళితకాపు బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివ కాపు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం ఆయన తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలసి వినతిపత్రం సమర్పించారు. రాజకీయాలకు అతీతంగా దళిత కాపు బీసీల అభ్యున్నతి కృషి చేయాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన అసోసియేషన్‌కు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షులు టైగర్ జయరామయ్య, సెక్రటరీ మునేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



భరతనాట్యం చేస్తున్న కళాకారులు



చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన పుష్ప నృత్యాలయం, నాట్య గురువు పుష్ప ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మహా గణపతి, నానే సరస్వతి, మలారి, గణేష కౌత్వం, ఏడు కొండల, జయలక్ష్మీ వరలక్ష్మీ, జగడపు జనవుల జాజర వంటి పాటలకు కళాకారులు దాన్విక, చెర్విత, ధన్యశ్రీ, మోక్షజ్ఞ, పూన్విత, భవ్య, తీక్షిక, లిత్విక, మోక్షిత, పవిత్ర, పూర్ణచంద్రిక, భవిష్య, మనశ్విల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడంతో ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పిల్లల అప్పగింత

తిరుపతి క్రైం: తల్లిదండ్రులు మందలించడంతో ఇళ్లు వదిలి వెళ్లిన ముగ్గురు విద్యార్థులను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈస్ట్ స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. టాటా నగర్‌లోని ప్రశాంత్ స్కూల్లో ఎం.రవిశంకరాచారి, కే.పవన్, టి.రానా పదో తరగతి చదువుతున్నారు. స్కూల్ యాజమాన్యం వీరి తల్లిదండ్రులను పిలిచి పిల్లలు సరిగా చదవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో ఈ ముగ్గురు కలిసి పారిపోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం మధ్యాహ్నం బ్యాగులు తీసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకుని, అందులో రవిశంకరాచారి తన తల్లికి ఫోన్ చేసి వెళ్లిపోతున్నామని చెప్పి కట్ చేశాడు. దీంతో వారు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా కనిపించక పోవడంతో ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థుల కోసం మూడు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఆదివారం ఉదయం ములకలచెరువులో ఉన్నట్లు సమాచారం రావడంతో ఆ బృందాలు వెళ్లి పిల్లలను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

శునకాలు అయితే గనుక..



తిరుపతి నగరంలో కుక్కల బెడద ఎక్కువవుతోంది. నగరంలోని ఏ రోడ్లపై వెళ్లినా వీధికుక్కలే హల్‌చల్ చేస్తున్నాయి. నడిచి వెళ్లేవారితో పాటు ద్విచక్ర వాహనదారులను వీధి కుక్కలు వెంటపడి దాడి చేసేందుకు యత్నిస్తున్నాయి. దీంతో రోడ్లపై వెళ్లాలంటే జనం బెంబేలెత్తి పోతున్నారు. వీధులు.. సందుల్లోనే కాదు.. ప్రధాన రహదారులపై కూడా శునకాల గుంపులే కనిపిస్తున్నాయి. తిరుపతి నగరపాలక సంస్థలో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నగర రోడ్లపై వీధి శునకాలు శివాలెత్తిస్తున్నాయి. కనీసం ఈ చిత్రాలను చూసిన తరువాత అయినా సంబంధిత అధికారులు స్పందిస్తారని నగరవాసులు ఆశిస్తున్నారు.





– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

తిరుపతి తుడా: ఆంధ్రప్రదేశ్ ఆడియాలజీ, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎయిర్ బైపాస్ నుంచి ఎమ్మార్‌పల్లి దండి సర్కిల్ వరకు వినికిడి లోపాలపై అవగాహన కల్పించడానికి 1కే వాక్‌థాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు మాట్లాడుతూ చిన్నవయసులో వినికిడిలోపం, తడబడుతూ మాట్లాడడం వంటి గుణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆడియాలజిస్టును, స్పీచ్ లాంగ్వేజ్ పేయాలజిస్టులను వెంటనే సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న ఆడియాలజీ, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ అసోసియేషన్ సభ్యులు

రెసిడెన్షియల్ స్కూళ్లను కాపాడండి



వాకథాన్ నిర్వహిస్తున్న గ్యారంపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు

తిరుపతి సిటీ: రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలల బంగారు భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని గ్యారంపల్లి రెసిడెన్షియల్ పాఠశాల అలూమిని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎస్వీయూ ఆడిటోరియం నుంచి జూపార్క్, అలిపిరి వరకు ఐదు కిలోమీటర్ల వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో రెసిడెన్షియల్ స్కూళ్లను బలోపేతం చేసి, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని, వాటి బంగారు భవిష్యత్ కోసం వెంటనే కార్యాచరణ ప్రారంభం కావాలన్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రపంచ మేధావులుగా అంతర్జాతీయ జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. ప్రస్తు తం పాఠశాలల పరిస్థితి, పరిపాలన సదుపాయాలు, అధ్యాపకులు కొరత తో అచేతన స్థితిలో పడిందన్నారు. గ్యారంపల్లె పాఠశాలలో పూర్వ విద్యార్థులు అనేక కార్యక్రమాలు చేశామన్నారు. రూ.కోటి నిధులతో నిర్మాణాలు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించి వసతుల కల్పనకు ముందుకు రావాలని కోరారు. పాఠశాలలో చదివిన వేలాది మంది ప్రొఫెసర్లుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, బ్యాంకు అధికారులు, రైల్వే తదితర విభాగాలలో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ఆధునిక సమాజంతో పోటీపడుతూ రెసిడెన్షియల్ స్కూళ్లను మరింత ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ గారంపల్లి అధ్యక్షుడు రవీంద్రబాబు, పూర్వ విద్యార్థులు సుమారు 150మంది పాల్గొన్నారు.

'వెలుగు పూల కోసం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అధ్యాపకుడు, కవి, డాక్టర్ ఎస్వీ రమేష్‌కుమార్ కవిత్వం సమాజాన్ని మేల్కొలిపే మంచిని చెబుతోందని వక్తలు ఉద్ఘాటించారు. విశ్వ శ్రీ సాహితీ సామాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వెలుగు పూల కోసం పుస్తకం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వశ్రీ అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు, ఆత్మీయ అతిథిగా విశ్రాంత అధ్యాపకుడు తమటం రామచంద్రారెడ్డి హాజరై వెలుగు పూల కోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాభై కవితలు ఉన్న ఈ పుస్తకంలో వస్తు వైవిధ్యం ఉందన్నారు. రైతులను, గురువులను, ప్రకృతితో పాటు అనేక అంశాలను కవి బలమైన భావాలతో కవిత్వీకరించారని తెలిపారు. రవి కుమార్తె ఈ కవితలకు భావ స్ఫూరకమైన చిత్రాలు గీయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శతావధాని ఆముదాల మురళి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఏ.మల్లేశ్వరరావు, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, రచయిత రమేష్ కుమార్, సాహితీ వేత్తలు సాకం నాగరాజు, వాకా ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, తోట వేంకటేశ్వర్లు, తిరువాయ్ పాటి రాజగోపాల్, మౌని, జీఎస్ ప్రసాద్, పలువురు అధ్యాపకులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.